ప్రజాశక్తి
గురువారం 22 ఆగస్టు 2024
పేజీలు 8





కర్నూలు
నంద్యాల

# శ్రీశైలంలో 'కుండపోత'



ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



శ్రీశైలం-హైదరాబాద్ ఘాట్ రోడ్డుపై విరిగిపడ్డ కొండ చరియలు

శ్రీశైలంలో మంగళవారం రాత్రి నుండి బుధవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. మునుపెన్నడూ లేని విధంగా శ్రీశైలం మండలంలో 130.8 మి.మీ వర్షపాతం నమోదయింది. భారీ వర్షంతో ఇళ్లలోకి నీరు చేరి ధాన్యం, దుస్తులు పూర్తిగా తడిసిపోయాయి. నల్లమల కొండల నుండి వర్షపు నీరు అధికంగా రావడంతో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన బైకులు, ఆటోలు కొద్దిదూరంగా కొట్టుకుపోయాయి. శ్రీశైలంలో పాతాళగంగ వద్ద, శ్రీశైలం-హైదరాబాద్ ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడ్డాయి. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో భక్తులకు పెను ప్రమాదం తప్పింది.

(వార్త 3వ పేజీలో..)

## మార్కెట్‌లో రైతుల సమస్యలు పరిష్కరించాలి

- మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత

(వార్త 3వ పేజీలో..)

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

(వార్త 3వ పేజీలో..)

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

(వార్త 4వ పేజీలో..)

## పశువుల ఉత్పత్తిలో ఘనీకృత వీర్యకేంద్రం కీలకపాత్ర

- నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

(వార్త 3వ పేజీలో..)

# వైసిపి పాలనలో నాసిరకంగా రోడ్ల నిర్మాణం

**- ఆర్ అండ్ బి అధికారులపై మంత్రి బీసీ ఆగ్రహం**

**ప్రజాశక్తి - బనగానపల్లె**

గత వైసిపి పాలనలో పట్టణంలో ఆర్ అండ్ బి రోడ్డు నాసిరకంగా వేశారని ఆర్ అండ్ బి అధికారులపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు , పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో ఆర్ అండ్ బి రోడ్లు, డ్రైనేజీ కాల్వలను మంత్రి పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ పట్ల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలు, పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, అధికారులు ప్రజా సేవపై దృష్టి పెట్టి పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలి నుండి అయ్యప్ప స్వామి దేవస్థానం వరకు కిలోమీటర్ నర్ర రోడ్డు నిర్మాణానికి కోట్ల నిధులు మంజూరయ్యాయని, అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్నారని అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అధికారులు కాంట్రాక్టర్లు హడావుడిగా నాసిరకం పనులు చేశారని విమర్శించారు. డ్రైనేజీ కాలువలలు అస్తవ్యస్తంగా వేశారని తెలిపారు. ఎన్నికల ముందు తాము రోడ్లు వేసాం, సెంటర్ లైట్లు వేసామని ఆర్భాటం చేసుకునేందుకు, ప్రజలను మోసం చేసేందుకు నాసిరకంగా రోడ్లు, ప్రణాళికబద్ధంగా వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ కాల్వల్లో నీరు సక్రమంగా పోవడం లేదన్నారు. పట్టణంలో వార్డుల వారీగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేస్తామన్నారు. ఆర్ అండ్ బి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను రెండు నెలల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈ సునీల్ రెడ్డి, ఏఈ హుసేని, ఈవోఆర్‌డి హరి ప్రసాద్, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, వంగల పరమేశ్వర రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, గణేష్ ఉత్సవ కమిటీ పట్టణ అధ్యక్షులు మల్లారెడ్డి, టిడిపి నాయకులు జోలాపురం నర్లా మదనమోహన్ రెడ్డి, లాయర్ నాగేంద్ర రెడ్డి ఖాదర్, బొబ్బల మద్దిలేటి రెడ్డి, ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


పట్టణంలో ఆర్ అండ్ బి రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి బీసీ


భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న బోజన పథకంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గౌస్‌మోహిద్దీన్ కోరారు. బుధవారం పాఠశాలలో లక్ష్మిదుర్గ పొదుపు సంఘం ఆధ్వర్యంలో నూతన ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేసిన మధ్యాహ్న బోజన పథకాన్ని విద్యాకమిటీ ఛైర్మన్, 4వ ఎంపీటీసీ, ఇన్‌చార్జ్ టిడిపి నాయకులు జెట్టి నాగరాజులు ప్రారంభించారు. పాఠశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని తమ పొదుపు సంఘంకు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టిడిపి నాయకులు భార్గవ్‌రామ్, భూమా విఖ్యాత్ రెడ్డిలకు జెట్టి పద్మావతి, సురేష్, సాయి, టిటి నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న సిఐ కృష్ణయ్య యాదవ్

## మాజీ సర్పంచిని కలిసిన సిఐ

**ప్రజాశక్తి - బనగానపల్లె :** పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో పట్టణ సీఐ కష్ణయ్య యాదవ్ ఉమ్మడి కర్నూలు జిల్లా టెలికామ్ అడ్వైజరీ కమిటీ మాజీ మెంబర్, పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సిఐ మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

## చాగలమర్రి తహశీల్దార్‌గా రవికుమార్


తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్

**ప్రజాశక్తి - చాగలమర్రి :** చాగలమర్రి నూతన తహశీల్దారుగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన బండిఆత్మకూరు తహశీల్దార్ గా పనిచేస్తూ ఎన్నికల బదిలీ నిమిత్తం కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం చాగలమర్రి మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. డిటి విజయ్‌కుమార్, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది నూతన తహశీల్దార్‌కు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

## ఆళ్లగడ్డ డిఎస్‌పిగా రవికుమార్ బాధ్యతలు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ నూతన డీఎస్పీగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ చిరంజీవి, రూరల్ సీఐ కంబగిరి రాముడు, పట్టణ ఎస్ఐ షేక్ నగీనా, రూరల్ ఎస్సై హరి ప్రసాద్ తదితరులు నూతన డీఎస్పీని కలిసి అభినందనలు తెలియజేశారు.


డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్

# పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

**- ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆఫీస్ ముందు కార్మికులు ధర్నా**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా కార్యదర్శి వి.బాల వెంకట్‌లు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం హాస్పిటల్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు పెండింగ్ మూడు నెలల వేతనాలు, పిఎఫ్ స్లిప్పులు ఏ నెలకు అ నెల ఇవ్వాలన్నారు. జీవో ప్రకారం రూ. 16 వేలు వేతనం ఇవ్వాలని, ఆప్కాస్‌లో కలిపి కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గురుస్వామి, చెన్నయ్య, ఫాతిమా, మహేష్, చెన్నమ్మ, సుగుణ, సుబ్బమ్మ, రాణి, నాగేంద్రమ్మ, మహాలక్ష్మి, లక్ష్మీదేవి, డి లక్ష్మీదేవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు

## ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి : సిఐ

**ప్రజాశక్తి - బేతంచర్ల**

పట్టణంలో వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై అశోక్ అన్నారు. ట్రాఫిక్‌పై విజిబుల్ పోలింగ్‌లో భాగంగా బుధవారం బేతంచర్ల నంద్యాల క్రాస్ రోడ్ నుండి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

## చేతుల శుభ్రతతోనే రోగాలు దూరం

**ప్రజాశక్తి - రుద్రవరం**

చేతులను శుభ్రం చేసుకోవడం వల్లనే రోగాలను దూరం చేయవచ్చని ఆలమూరు వైద్యాధికారి అమర్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆలమూరులోని అంగన్వాడి కేంద్రాలను, పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నాలుగు డిసి, ఎత్తు, తూకాలను రక్త పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి : ఎఒ

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మండలంలోని గ్రామాల రైతులు పంటల నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని బుగ్గానిపల్లి గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి బీసీని కలిసిన ఎస్ఐలు

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోయిలకుంట్ల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున రెడ్డి, సంజామల ఎస్సై రమణయ్యలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి ఎస్ఐలు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.


మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న కోవెలకుంట్ల ఎస్ఐ

# విజేతలకు అభినందన సత్కారం

**ప్రజాశక్తి - నంద్యాల**

స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మాతృభూమికి కళార్చన పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు ఏపీ బయోడైవర్సిటీ బోర్డు వారు గురురాజా ఓపెన్ ఆడిటోరియంలో బుధవారం అట్టహాసంగా అభినందన సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ డా. పి దస్తగిరి రెడ్డి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జి.రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణలు హాజరయ్యారు. విజేతలకు జ్ఞాపికలు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గురురాజా విద్యార్థుల విజయాలను చూస్తుంటే వారు ప్రతి రంగంలో తీర్చిదిద్దుతున్నారనడానికి ఈ విజయాలే తార్కాణమన్నారు. మాతృభూమికి కళార్చన పోటీలలో బహుమతులన్నీ వీరే సాధించారనడానికి చిన్నారుల ప్రతిభ పాటవాలు అమోఘం అన్నారు. ముఖ్యంగా సైరా నరసింహారెడ్డి బృంద నృత్య రూపకం నాటి స్వాతంత్రోద్యమ చారిత్రక ఘట్టాలను కనులకు కట్టినట్లుగా అద్భుతమైన నటన ప్రదర్శనతో జాతీయత దేశభక్తి భావాలను కనువిందు చేశారన్నారు. నేటి తరం పిల్లలకు ఇలా ప్రతి కాంపిటీషన్ నందు పంపించడం వలన వారిలో ప్రతిభా శక్తిని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలను ఎంతో అవసరమని, వీటిని ప్రోత్సహిస్తున్న స్కూల్ యాజమాన్యానికి, విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు పి.మౌలాలి రెడ్డి, షేక్షావల్ రెడ్డి పాల్గొని అతిథులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.


విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి ఎన్ఎండి.ఫరూక్

**బుగ్గన రాజారెడ్డి చొరవతోనే**

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- ఎంపిపి, మున్సిపల్ ఛైర్మన్**

**ప్రజాశక్తి - బేతంచర్ల**

డోన్ నియోజకవర్గంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకుందని ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచర్ల నగర పంచాయతీ మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాష్ట్రంలో తాగునీటి సమస్య పరిష్కారం కొరకు మూడు వాటర్ గ్రిడ్లను శాంక్షన్ చేయించి తీసుకొచ్చారన్నారు. అందులో ఒకటి శ్రీకాకుళం జిల్లా, రెండవది పులివెందుల, మూడవదిగా డోన్ నియోజకవర్గం అన్నారు. అందులో భాగంగా డోన్ నియోజకవర్గం లోని మూడు మండలాలలో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం 351 కోట్ల రూపాయలతో బేతంచెర్ల మండలం బుగ్గానపల్లి తండా వద్ద వాటర్ గ్రిడ్డును ఏర్పాటు చేశారన్నారు. దాదాపు 20 గ్రామాలకు రాబోయే 20 రోజులలోపు గోరుకల్లు నీటిని సరఫరా అవుతుందన్నారు. బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్, సంజీవ్ నగర్, సుబ్బారెడ్డి నగర్, డ్రైవర్స్ కాలనీ, అల్లాబకాష్ దర్గా ఏరియా ప్రాంతాలలో గోరుకల్లు రిజర్వాయర్ నుండి వచ్చే శుద్ధ జల నీటిని సరఫరా చేయడానికి గత ఏప్రిల్ నుండి రైల్వేట్రాక్ వల్ల ఇబ్బందిగా ఉండేదని, అయితే రైల్వే అధికారులు అనుమతి ఇచ్చినందున రెండు మూడు రోజులలో డ్రిల్లింగ్ పనులు పూర్తి చేసి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం అవుతుందని తెలిపారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ మూర్తుజావలి, మాజీ వైస్ కాజా హుస్సేన్, మద్దిలేటి స్వామి మాజీ ఛైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, ప్రస్తుత ఛైర్మన్ సీతారామ చంద్రుడు, మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ ఇబ్రహీం, ఎద్దులన్న, రామలకోట కృష్ణుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపి

ప్రజాశక్తి 3
గురువారం 22 ఆగస్టు 2024

# శ్రీశైలంలో 'కుండపోత'

**- దాదాపు 6 గంటలపాటు ఎడతెరిపి లేని వర్షం**
**- ఉరుములు, మెరుపులతో భీభత్సం**
**- లోతట్టు కాలనీల ఇళ్లలోకి చేరిన నీళ్లు**
**- విరిగి పడిన కొండ చరియలు - తప్పిన పెను ప్రమాదం**

**ప్రజాశక్తి - శ్రీశైలం/ప్రాజెక్టు**

శ్రీశైలంలో మంగళవారం రాత్రి నుండి బుధవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. క్షేత్రం పరిధిలో మునుపెన్నడూ లేని విధంగా మంగళవారం రాత్రి 8:30 గంటలకు ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఏకధాటిగా కురిసి బీభత్సం సృష్టించింది. శ్రీశైలం మండలంలో 130.8 మి.మీ వర్షపాతం నమోదయింది. శ్రీశైల క్షేత్రంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీలోని దాదాపు 40 ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో బియ్యం బస్తాలు, దుస్తులు, ఆహార ధాన్యాలు పూర్తిగా తడిసిపోయాయి. ప్రజలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్‌లో కె, ఎల్ బ్లాక్‌ల మధ్య నుండి వచ్చిన వర్షపు నీరు పాతాళగంగ మెట్ల మార్గం ద్వారా పాతాళగంగలోకి ప్రవహించింది. ఎగువన అటవీప్రాంతం నుండి భారీగా వచ్చిన వర్షపు నీరు కాలనీల్లోకి రావడంతో ఇండ్ల ముందు పెట్టిన బైకులు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. శ్రీశైలంలో పాతాళగంగ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో భక్తులకు పెను ప్రమాదం తప్పింది. ఇళ్లలోకి నీళ్లు చేరి తీవ్రంగా నష్టోపోయిన పేదలకు శ్రీశైల హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

**నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం**

శ్రీశైల దేవస్థానం పరిధిలో కురిసిన భారీ వర్షాలకు నిరుపేద కుటుంబాలకు నష్టం వాటిల్లిందని, దేవస్థానం, ప్రభుత్వం ఆ కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, శ్రీశైలం కార్యదర్శులు ఎం.మల్లికార్జున, వెంకటేష్ కోరారు. కూలీ పనులు చేసుకునే నిరుపేదలు తెచ్చుకున్న తినుబండారాలు, వంట సామగ్రి, సరకులు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయంతో పాటు వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, బెడ్ షీట్లు అందజేయాలని కోరారు.

**ఘాట్ రోడ్‌లో విరిగిపడ్డ కొండ చరియలు :** శ్రీశైలం మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు డ్యాం పరిసర ప్రాంతాలలోని ఘాట్ రోడ్డులో



వర్షపునీటికి కొట్టుకొచ్చి గోడకు తగిలి నిలిబడిన వాహనం

కొండ చరియలు విరిగిపడ్డాయి. ఏకధాటిగా రాత్రంతా కురిసిన వర్షానికి ఎత్తైన నల్లమల కొండల్లో మట్టి కొట్టుకుపోయి పెద్దపెద్ద బండరాళ్లు శ్రీశైలం–హైదరాబాదు ప్రధాన రహదారిపై పడ్డాయి. రాత్రివేళ కావడంతో వాహన రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనదారులు శ్రీశైలం డ్యామ్ ఘాట్ రోడ్‌లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షానికి శ్రీశైలం, సుండిపెంట, లింగాలగట్టు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్యాంకు దిగువ భాగాన ఉన్న లింగాలగట్టు ప్రాంతంలో కొండలలో నుండి భారీగా వర్షం రావడంతో చిన్న బ్రిడ్జి దగ్గర స్థానిక ప్రజలు ఇబ్బందులను పడ్డారు. మండలంలో వర్షపాతం 130.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు సహాయ గణాంకాల అధికారి వి. బాల లక్ష్మయ్య తెలిపారు.

# మార్కెట్‌లో రైతుల సమస్యలు పరిష్కరించాలి

**- వాము కొనుగోళ్లలో సమస్యలున్నాయా..?**
**- అధికారులు ఇష్టానుసారంగా రావడం, పోవడం కుదరదు**
**- మార్కెట్ సెస్సు వసుల్లో టార్గెట్ పూర్తి చేయాలి**
**- మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత**

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

మార్కెట్ యార్డుకు వచ్చే రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని, అధికారులు నిర్లక్ష్యం వదిలి నిబద్ధతతో పని చేయాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత అన్నారు. బుధవారం కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్నూలు మార్కెట్ యార్డుల్లో ఆమె పర్యటించారు. కర్నూలు మార్కెట్‌యార్డులో మార్కెట్‌కు వచ్చిన ఉల్లి రైతులతో ఆమె మాట్లాడారు, ధర ఎలా ఉంది, టెండర్ విధానం ఎలా జరుగుతుంది, తుకాల్లో మోసం జరుగుతుందా, ఏమైనా సమస్యలున్నాయా అని రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌యార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేయాలని, ఎప్పుడు పడితే అప్పుడు రావడం, పోవడం కుదరదని, ఆఫీస్‌కు సంబంధించిన ప్రతి పేపర్ ముఖ్యమేనని, బాధ్యతతో ఉండాలని చెప్పారు. ప్రపోజల్స్ పెండింగ్‌లో ఉన్నాయా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తాగునీరు, డ్రైనేజీ, మహిళల మరుగుదొడ్లు లాంటి సమస్యలు ఉంటే త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్‌కు రావాల్సిన సెస్సు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని, టార్గెట్ ఖచ్చితంగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ట్రేడర్స్‌లో సిండికేట్ వ్యాపారాలు లేకుండా తగిన సూచనలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. మార్కెట్‌లో లైసెన్స్ రెన్యువల్స్‌లో అవకతవకలు జరిగాయని,వాములో జీరో వ్యాపారం నిర్వహిస్తున్నారని, కొందరు ఉద్యోగులను కావాలని విధులు మారుస్తున్నారని విలేకరులు కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలైనా ఆధారాలు ఉంటే కచ్చితంగా అధికారకంగా చర్యలు తీసుకుంటామని, జిల్లా స్థాయి నుండి ఇలాంటి సమస్యలు ఉన్నాయని ఇప్పుడే తమ దృష్టికి వచ్చింది తెలిపారు. త్వరలో ఈ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్‌లో విధుల్లో ఉండి మరణించిన సెక్యూరిటీ సిబ్బంది వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని వారి కుటుంబ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, డిడి శ్రీకాంత్ రెడ్డి, ఏడి నారాయణ మూర్తి, కార్యదర్శి గోవిందు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారెడ్డి, మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్‌కు ఉల్లి దిగుబడులు ఎంత వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ విజయ సునీత

# మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - వెల్దుర్తి**

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం వెల్దుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను, డిస్పెన్సరీ (ఫార్మసీ)ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులతో వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మందుల గురించి 3 నెలలు ముందుగానే డాక్టర్ల దృష్టి తీసుకెళ్లాలని ఫార్మాసిస్ట్‌ను ఆదేశించారు. వైద్యశాలకు కరెంట్ బ్యాకప్ కోసం జనరేటర్ ఏర్పాటు చేయించాలని, ఆర్‌ఓ వాటర్ సిస్టం ఏర్పాటు చేయించాలని, జనరల్ సర్జన్ విధులకు గైర్హాజరు అయ్యారని, అతని స్థానంలో వేరే జనరల్ సర్జన్‌ను ఏర్పాటు



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

చేయించాలని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. వైద్యశాలకు అవసరమైన అంశాల న్నింటినీ రాతపూర్వకంగా ఇవ్వాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిసిహెచ్ఎస్ డా.మాధవి, పిడియాట్రిక్ డాక్టర్ బాలచంద్రా రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ :** అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థినిలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, భోజన సదుపాయాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, టాయిలెట్స్‌లను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట డిఇఒ, వెల్దుర్తి తహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ ఉన్నారు.

# పశువుల ఉత్పత్తిలో ఘనీకృత వీర్యకేంద్రం కీలకపాత్ర : కలెక్టర్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

పశుజాతి అంతరించిపోతున్న ఈ రోజుల్లో నాణ్యమైన ఘనీకృత వీర్యాన్ని తయారు చేసి పశువులను ఉత్పత్తి చేయడంలో నంద్యాల ఘనీకృత వీర్యకేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ జి.రాజుకుమారి వెల్లడించారు. బుధవారం నంద్యాల పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనీకృత పశువీర్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ సంస్థలో 10 జాతుల పశువుల వీర్యాన్ని సేకరించి భద్రపరిచి అవసరమైన జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తున్నారన్నారు. సెమన్ బ్యాంకు, బుక్ మేనేజ్మెంట్, లేబోరేటరీ, డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను సందర్శించి చక్కగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ ప్రశంసించారు. ఇక్కడి ఆబోతులను బయో సెక్యూర్ జోన్‌లో ఉంచి వ్యాధులు సోకకుండా క్రమం తప్పకుండా టీకాలు వేయడం జరుగుతుందని పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్ కలెక్టర్‌కు నివేదించారు. 16.94 ఎకరాల విస్తీర్ణంలో పశు గణనాభివృద్ధి సంస్థ, ఘనీకృత వీర్యకేంద్రం ఉందన్నారు. ఈ కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, సిబ్బంది పని చేస్తున్నారన్నారు. 11.94 ఎకరాలలో ఆబోతులకు కావాల్సిన సూపర్ నేపియర్, కాకిజొన్న, గనిగడ్డి లాంటి నాణ్యమైన పశుగ్రాసాన్ని పండిస్తున్నామన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జరుగుతున్న పనుల గురించి తెలుసుకుంటూ సివిల్ వర్క్సకు చెందిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



పశువులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి




మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

# అంతర్ రాష్ట్రాల చెక్ పోస్టుల్లో నిఘా

**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా అంతర్ రాష్ట్రాల చెక్ పోస్ట్‌ల వద్ద పటిష్టమైన నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ మత్తుపదార్థాల నియంత్రణన జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాలను వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలను పెంచాలన్నారు. గంజాయి సాగును నియంత్రించాలన్నారు. ఈ నెల 23న జరిగే గ్రామ సభలు, సమావేశాల్లో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఒక ప్రతిజ్ఞ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలపై యువతలో అవగాహన కల్పించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 30 ప్రభుత్వ కళాశాలు, 44 ప్రైవేటు కళాశాలలోని సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సెబ్ అసిస్టెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, అటవీ శాఖ అధికారి శ్యామల, ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

**7 మండలాల్లో 4,405 హెక్టార్లలో పంట నష్టం : కలెక్టర్**

జిల్లాలో భారీ వర్షాల కురిసిన నేపథ్యంలో ఏడు మండలాల్లో 4405 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. వెంటనే అధికారులు పర్యటించి ప్రాథమిక నివేదికను పంపాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి భారీ వర్షాలు కురవడంతో కొన్ని మండలాలలోని వాగులు, వంకలు ఉదతంగా ప్రవహించాయన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటిని వేడి చేసుకొని తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

# పౌరసరఫరాల శాఖ గిడ్డంగిని జెసి తనిఖీ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ గోదామును జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముకు వచ్చిన నిల్వలు, పంపిణీ చేసిన సరుకులు, ప్రస్తుత నిల్వలను, సంచుల్లోని బియ్యం తూకాలను పరిశీలించారు. అనంతరం తాహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఆళ్లగడ్డకు వచ్చిన జెసికి తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెసి తాసిల్దార్ కార్యాలయంలో ఉన్న పాత రికార్డులు, వాటి భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, ఉప తాహసిల్దార్ చంద్రశేఖరయ్య, సర్వేయర్ రవి ప్రకాష్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ గోదామును తనిఖీ చేస్తున్న జెసి

# పంట నష్టం వివరాలు సేకరించాలి

- దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జెసి


నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న జెసి

**ప్రజాశక్తి - దేవనకొండ**

పంట నష్టం అంచనా వివరాలను సేకరించాలని జెసి నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని తెర్నేకల్లు, పొట్లపాడు గ్రామాల్లో పర్యటించి హంద్రీ వాగు వరద ఉధృతికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో హంద్రీ వాగు పరివాహక ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, మిరప, జొన్న, కంది పొలాల్లోకి వరద నీరు చేరి, పంట నష్టాన్ని అంచనా వేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. హంద్రీ వాగులో ముళ్ల కంపలు, చెట్లు పెరగడంతో వరద ప్రవాహం సక్రమంగా ముందుకు పోవడం లేదని, పంట పొలాల్లోకి వరద నీరు ప్రవహిస్తున్నట్లు తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ జెసి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం కింద చెట్ల తొలగింపు చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, దేవనకొండ తహశీల్దార్ జయన్న, అధికారులు దాదావలీ, ఆనంద్ కుమార్, రాముడు, జయ రాము, రంగన్న, యోగేంద్ర, సలీం పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హంద్రీ నది పొంగి పొర్లడంతో నీట మునిగిన పత్తి, మిరప, ఆముదం, టమోటా, వేరుశనగ తదితర పంటలను జెసి నవ్య పరిశీలించారు. హంద్రీ నది పరివాహక ప్రాంతంలో దాదాపు 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు స్థానిక రైతులు జెసి దృష్టికి తీసుకొచ్చారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం వచ్చేలా ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని జెసి హామీ ఇచ్చారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని జెసి నవ్య ఆదేశించారు. పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, ఆలూరు ఎడిఎ సునీత, తహశీల్దార్ శివ శంకర్ నాయక్, ఎఒ కుమార్ పాల్గొన్నారు. **పత్తికొండ** మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి చిన్నహల్తి, మండగిరి, జూటూరు సమీపంలో హంద్రీనీవా పరివాహక ప్రాంతంలో నీటి మునిగిన పంట పొలాలను జెసి నవ్య పరిశీలించారు. పత్తి, ఉల్లి, మిరప, టమోటా, కంది, సజ్జ తదితర పంటలు నీట మునగడంతో నష్టపోయామని రైతులు జెసి నవ్యతో మొరపెట్టుకున్నారు. ఆర్‌డిఒ రామలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎఒ వెంకట్ రాముడు, హార్టికల్చర్ అధికారి దస్తగిరి పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణలు జిల్లా ఇన్‌ఛార్జీ, రెవెన్యూ అధికారి చిరంజీవికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, సజ్జ మొదలగు పంటలు పూర్తిగా తడిసిపోయి రైతులు నష్టపోయారని తెలి పారు. సుమారు 2వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు పడి పంటలు వేపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని ఆశతో ఉన్న రైతులకు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఏడు మండలాల రైతులు నష్టపోయారని వెంటనే వారిని ఆదుకోవాలని ఇన్‌ఛార్జీ డిఆర్‌ఓకు విజ్ఞప్తి చేశారు. డిఆర్‌ఓ స్పందిస్తూ వెంటనే వ్యవసాయ, రెవెన్యూ శాఖలను కదిలించి నష్టపరిహారం జాబితా తయారు చేసి నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# సర్పంచి భీమయ్యకు పితృ వియోగం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పరామర్శ

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మేజర్ పంచాయతీ సర్పంచి తెల్లబండ్ల భీమయ్యకు పితృ వియోగం చోటు చేసుకుంది. తెల్లబండ్ల రాఘన్న (66) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భీమయ్యకు, ఇతర కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తెల్లబండ్ల రాఘన్న రాంపురం రెడ్డి సోదరుల కుటుంబానికి విధేయుడిగా ఉండేవారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, బాబి రెడ్డి, పెట్రోలు బంకు శ్రీనివాసులు రాఘన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ప్రాణేష్‌ను పరామర్శించారు. తెల్లబండ్ల రాఘన్నతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామరెడ్డి, వైసిపి నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వై.ధరణి రెడ్డి ఫోన్ ద్వారా సర్పంచిని పరామర్శించారు. జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ కుమారుడు మజ్జిగ రోగ్గప్ప, బొజ్జప్ప, రవి రెడ్డి, రాఘన్న మృతదేహానికి పూలమాలలు నివాళులర్పించారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి




# అభివృద్ధి పనులను గుర్తించాలి : వ్యకాస


వినతి పత్రం అందజేస్తున్న వ్యాకాస నాయకులు

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులను గుర్తించి ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, జిల్లా సహాయ కార్యదర్శి పి పకీరి సాహెబ్, జిల్లా నాయకురాలు ఈశ్వరమ్మ ఎంపిడిఓ కార్యాలయంలో సూపర్డెంట్ నాగేంద్ర ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల, 200 గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఉపాధి కూలిలకు 38 రకాల పనులను ప్రభుత్వం గుర్తించిందని, ఇందులో కొన్ని పనులు రైతు పొలాల్లో గులకరాళ్లు తొలగించడం, రైతుల బీడు భూముల్లో కంప చెట్లు, బండ రాళ్లు తీసివేయడం, హార్టికల్చర్‌లో ఉపాధి హామీ ద్వారా ఐదు ఎకరాల నిబంధనలను తొలగించి పది ఎకరాల వరకు వర్తింప చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలన్నారు. దళిత కాలనీలో సిసి రోడ్లు, ఇళ్ల కోసం ఇచ్చిన స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పట్టణ ప్రాంతంలో ఉపాధి హామీని అమలు చేయాలని, తదితర డిమాండ్లను ఈ నెల 23న జరిగే గ్రామ సభలో తీర్మానం చేయలన్నారు. అధికారులు తూతూ మంత్రంగా గ్రామ సభలు నిర్వహిస్తే సహించమని వారు హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కే వెంకటేశ్వర్లు, జయరాణి, సిఐటియు నాయకులు సి నాగన్న, ఆంజనేయులు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు డి బాబు, ఉపాధి కూలిలు ఉన్నారు.











సమావేశంలో మాట్లాడుతున్న ఇఓ డి. పెద్దిరాజు

## వర్షాలతో ఇబ్బందుల్లేకుండా..
## ఆలయ డార్మెటరీలో ఉచిత వసతి : ఇఓ

**ప్రజాశక్తి - శ్రీశైలం**


భారీవర్షాల వల్ల స్థానికులకు, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలోని డార్మెటరీలో ఉచిత వసతి కల్పిస్తున్నట్లు ఆలయ ఇఓ డి పెద్ది రాజు పేర్కొన్నారు. వర్షాల వల్ల ఇబ్బంది లేకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిపాలనా కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిప్యూటీ కార్యనిర్వాహణాధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితర శాఖల అధిపతులు, అన్నీ విభాగాల పర్యవేక్షకులు, సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందితో ఇఓ బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వర్షాల వల్ల పారిశుధ్య సమస్యలు ఏర్పడుతాయని, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలు తొలగించాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. తాగునీరు కలుషితం గాకుండా ఉండేందుకుగాను పకడ్బందీగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నీటి సరఫరా అధికారులని ఆదేశించారు. భారీవర్షం వల్ల క్షేత్రంలోని పలు రహదారులు జలమయం అయ్యాయని, పాదచారులు ఆయా ప్రదేశాల్లో రహదార్లపై మ్యాన్ హోళ్ళ దగ్గర బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షం కారణంగా క్షేత్రంలోని పలు ఇళ్లల్లోకి నీళ్లు చేరడంతో ఇళ్లల్లో వంట చేసుకునే అవకాశం లేని వారికి దేవస్థాన అన్నప్రసాద వితరణలో భోజనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఇఓ సంబంధిత అధికారులతో కలిసి పలుచోట్ల పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఆలయ పుష్కరణి ప్రాంతం, ఆలయ ఉత్తర మాడవీధి ఇంజనీరింగ్ స్టోర్ పరిసరాలు, పాతాళ గంగ మార్గం, శివసేవకుల వసతి డార్మిటరీలు, కళ్యాణకట్ట, శివసదనం కూడలి, పెదసత్రంను పరిశీలించారు.









## అభివృద్ధి పనులు గుర్తించాలి : ఎంపిడిఓ

**ప్రజాశక్తి - పాములపాడు :** ఈ నెల 23న మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభల్లో అభివృద్ధి పను లను గుర్తించాలని ఎంపిడిఓ గోపి కృష్ణ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఆయన బుధవారం సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి చేసే ఉపాధి పనుల గుర్తింపులను గ్రామ సభల్లో గుర్తించాలన్నారు. రైతుల పొలాల రస్తలు, వివిధ పనులపై ప్రజల అభిప్రాయాల మేరకు గుర్తించి వాటినే చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇఓఆర్డీ గంగాధర్, ఏపీవో విమలమ్మ, పంచాయతీ రాజ్ జేఈ రాఘవేంద్ర ప్రసాద్, ఉపాధి జేఈ రమేష్ నాయుడు వివిధ గ్రామాల కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో గోపికృష్ణ

**ఆత్మకూర్ :** మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను గుర్తించి ఈ నెల 23న నిర్వహించే గ్రామ సభల్లో చర్చించాలని ఎన్ఆర్ఇజిఎస్ ఏపిడి అన్వర్ బేగం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆమె బుధవారం సమావేశమై మాట్లాడారు. గ్రామ సభల్లో గ్రామంలో నిర్వహించే అభివృద్ధి పనులను సమీక్షించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో చేపట్టే పనులను గురించి చర్చించి వాటిని ఆమోదించడంతోపాటు ఎస్టిమేషన్ వేయడం తప్పనిసరని, వేసిన ఎస్టిమేషన్ కాపీలను వెంటనే ఉన్నత అధికారులకు పంపాలని తెలిపారు. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన వెంటనే ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో మోహన్ కుమార్, ఇఓఆర్డీ మోహన్ కుమార్, హౌసింగ్ ఏఇ ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్ఇజిఎస్ ఏపిఓ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఇజిఎస్ ఏపీ డి అన్వర్ బేగం

## శ్రీశైలంకు 1,53,104 క్యూసెక్కుల నీటి ప్రవాహం

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు :** కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,53,104 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరింది. అలాగే ఎగువ జ్వూరాల నుండి 60, 202 క్యూస్సెక్కుల నీళ్లు, తుంగభద్ర నుండి 92,652క్యూసెక్కుల నీళ్లు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరింది. కుడిగట్టు విద్యుత్తు ఉత్పాదనను నిలిపి వేయడంతో జలాశయం నీటిమట్టం 882.50అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 251.5822 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీ నీవా, సుజాల స్రవంతికి 1410, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కి 30,000, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో గడచిన 24 గంటల్లో 16.680 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 37,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడం జరిగింది. నీటి ప్రవాహం కొనసాగితే గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన ఉండాలి

**ప్రజాశక్తి - పాణ్యం :** ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని శాంతి రామ్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ హెచ్ఓడి డాక్టర్ శేషయ్య పేర్కొన్నారు. మిట్టకందాలలోని స్పోర్ట్స్ ఎనర్జీ పరిశ్రమను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమంలోని యంత్రాల పని తీరు, నిర్వహణ తదితర వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదిలో చదివిన పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంలో సులభంగా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవిచంద్ర, నాగరాజు, ఇసీఇ విద్యార్థులు పాల్గొన్నారు.

## 24న విద్యా కమిటీ ఎన్నికలు

**ప్రజాశక్తి - పగిడ్యాల :** ఈ నెల 24న పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 17న విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించగా విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో హాజరు కానందున వాయిదా వేశామని ఆయన తెలిపారు. ఈ సారి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - నంద్యాల :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా మోడల్ స్కూల్ సిబ్బందికి 010 పద్దు జీతాలు పొందడానికి ఏపి యంయస్టీయు చేసిన కృషి ప్రశంసనీయమని ఏపి యంయస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు యం. మోహన్ రెడ్డి అన్నారు. నంద్యాలలోని యస్టీయు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మోహన్ రెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపియంయస్టీయు నిరంతరం పోరాడు తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షునిగా కొలిమిగుండ్ల ఏ.పి.మోడల్ స్కూల్‌లో పి.జి.టి(ఇంగ్లీషు)గా పని చేస్తున్న జి.గోవిందు, జనరల్ సెక్రటరీగా ముఖేష్(పి.జి.టి-ఇంగ్లీషు), ట్రెజరర్ డా.వెంకటరమణ(పి.జి.టి-జువాలజీ)ని ఎంపిక చేసినట్లు తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ మునిరత్నం, మార్కండేయులు, వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ సంజీవరెడ్డి, ఖాజాహుసేన్, శ్రీనివాసరెడ్డి, రఫీ, ఉపాధ్యాయులు డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శివశంకర్, హజీబాష, చంద్రసేనారెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి : బిసి ఇందిరా రెడ్డి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

చదువుతోపాటు క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. కరాటేలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను బీసీ జనార్దన్ రెడ్డి తన నివాసంలో బుధవారం సన్మానించారు. ఈ నెల 15 నుండి 18 వరకు హర్యానా రాష్ట్రంలోని చండీఘర్‌లో జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో మన రాష్ట్రం నుంచి ఆరు మంది క్రీడాకారులు మెడల్స్ సాధించారు. ఇందులో బనగానపల్లెకు చెందిన ఇద్దరు క్రీడాకారులు మెడల్స్ సాధించారు. క్రీడాకారులను బిసి ఇందిరా రెడ్డి శాలువా కప్పి సన్మానించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హర్యానాలో జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో మన రాష్ట్ర క్రీడాకారులకు మెడల్స్ రావడం, ఇందులో బనగానపల్లె నుండి ఇద్దరు క్రీడాకారులు ఉండడం సంత ోషించదగ్గ విషయమన్నారు. మెడల్స్ సాధించిన 6 మంది క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మన రాష్ట్రానికి మరిన్ని మెడల్స్ తీసుకురావాలని కోరారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహాయ సహకారాలతో బనగానపల్లెను స్పోర్ట్స్‌లో మొదటి స్థానానికి తెచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి మహిళ కరాటే నేర్చుకోవాలన్నారు. దివ్య, చైతన్య రెడ్డి, సాయి చరణ్ తేజ మెడల్స్ తీసుకురావడం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్స్ కళ్యాణ్ బాబు, కరాటే బాషా, హరీష్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


క్రీడాకారులను సన్మానిస్తున్న బిసి ఇందిరా రెడ్డి


డిఎస్‌పిని సన్మానిస్తున్న మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్

## డిఎస్పీని సన్మానించిన ప్రజాప్రతినిధులు

**ప్రజాశక్తి - ఆత్మకూర్ :** ఆత్మకూర్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రామంజి నాయక్‌ను మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు యంఏ. రషీద్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఏ రషీద్ మాట్లాడుతూ రామంజీ నాయక్ ఆత్మకూరుకి డీఎస్పీగా రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డిఎస్పీని సన్మానించిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్లు మూర్తుజ, కలిముల్లా, షఫీవుల్లా, శంకర్, పార్వతీ, మక్బూల్, రంగా స్వామి, నాయకులు మోమిన్, మునీర్ బాషా, రఫీక్, శంషుర్ తదితరులు పాల్గొన్నారు.

## ఋతుక్రమంలో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ హిందుమతి

**ప్రజాశక్తి - పాణ్యం :** ఋతుచక్ర సమయంలో స్త్రీలు పలు జాగ్రత్తలు పాటించాలని శాంతిరాం మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ హిందుమతి పేర్కొన్నారు. ఆర్‌జియం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత సెల్ కో-ఆర్డినేటర్ హరిత ఆధ్వర్యంలో ఋతుచక్రం, శుభ్రతపై కళాశాల విద్యార్థినిలు, మహిళా అధ్యాపకులకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఋతు స్రావం జీవితంపై, శరీరంపై ఎలా ప్రభావం చూపిస్తుందన్న విషయాలపై వివరించారు. ఈ సమయంలో ఎలా శుభ్రత పాటించాలి, ఎలా పనులు చేసుకోవాలో వివరించారు. నెలవారి హార్మోన్ల చక్రం ఋతు కాలం ప్రారంభం నుంచి తదుపరి ప్రారంభం వరకు మారుతుందన్నారు. నెలవారి సమయంలో గర్భం కోసం గర్భాశయం సిద్ధంగా ఉంటుందన్నారు. కౌమార దశలో ఉన్న బాలికల శ్రేయస్సు, సాధికారతకు రుతుక్రమ ఆరోగ్యం, పరిశు భ్రత అవస రమన్నారు. రుతుక్రమం సమర్థవంతంగా నిర్వహించుకునే సహాయక వాతావరణం ఎంతో అవసరం అన్నారు. ముడిపడి ఉన్న ప్రాథమిక వాస్తవాలను ఎలా నిర్వహించుకోవాలో అర్థం చేసుకోవాలన్నారు. ఋతు క్రమ సమయంలో బాలికలపై దురభిప్రాయాలు వేధింపులు, ఆర్థిక అసమానతలు తీవ్రతరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డైరెక్టర్ అశోక్ కుమార్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, విద్యార్థినీలు, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## విద్యుత్ కోతలను నివారించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - కొత్తపల్లి :** పల్లెల్లో నెలకొన్న అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు, ఎస్ సంజీవ రాయుడు, పి ఏసన్నలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారుల అలసత్వంతో పల్లెల్లో కరెంటు ఎప్పుడు పోతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయ పొలాల్లో మోటార్ల దగ్గర రైతులు పడిగాపులు గాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాత్రి వేళల్లో ప్రజలు దోమలు, ఉక్కపోతతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి విద్యుత్ అధికారుల పలుమార్లు ఫోన్లు చేసినా సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ కోతల వేళలను విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను ఆపాలన్నారు. లేని పక్షంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## మెరుగైన వైద్యం అందించాలి


**ప్రజాశక్తి - మిడుతూరు :** ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలు, వారికి వచ్చే రోగా లను గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తే గుర్తింపు వస్తుందని జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జఫ్రుల్లా వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జఫ్రుల్లా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన వైద్య సిబ్బంది హాజరును, పేషెంట్లకు అందుతున్న ట్రీట్మెంట్‌ను, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి అక్కడ ఉన్న పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో డాక్టర్ తిరుపతి, డాక్టర్ శారద, డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ సాయి సుధా, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ, ఫార్మసీ ఆఫీసర్ మాదన్న, శ్రీజ నర్సింగ్ ఆఫీసర్స్ ముత్తుజావలి, ప్రశాంతి, రామ తులసి, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

## భారత్ బంద్ పాక్షికం

**ప్రజాశక్తి - ఆత్మకూర్ :** ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు, దళిత సంఘాలు బుధవారం నిర్వహించిన బంద్ పాక్షికంగా కొనసాగింది. బంధు నేపథ్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిఎస్పి రామంజి నాయక్, సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో భారీ పోలీసులు పహారా నిర్వహించారు. బందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ప్రభుత్వ, ప్రయివేటు దుకాణాల యజమానులతో మాల మహానాడు నాయకులు ఎలీషా, మల్లయ్య, కేశాలు, రవికుమార్ మాట్లాడి బంద్ చేయించారు. **శ్రీశైలం ప్రాజెక్టులో..** మాల మహానాడు, దళిత సంఘాలు నిర్వహించిన బంద్ పాక్షికంగా కొనసాగింది. ఆర్టీసీ బస్టాండు, పార్క్ దగ్గర స్థానిక టూటౌన్ ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. మాల మహానాడు నాయకులు బైకులపై పర్యవేక్షిస్తూ... బంద్‌కు సహకరించాలని ప్రయివేటు, ప్రభుత్వ విద్యా సంస్థలను కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చందం గాలయ్య, శేషయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు. **పాములపాడులో..** మాల మహానాడు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించి రాస్తారోకో చేపట్టారు. అనంతరం మాల మహానాడు జిల్లా నాయకులు అబ్రహాము, అంకన్న, రాజన్న, నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సామన్నలు మాట్లాడారు. దేశంలో ఎస్సీలను విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి కుట్ర చేస్తుందని విమర్శించారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అంశంపై పుఃనపరిశీలన చేసుకోవాలని కోరారు. అలాగే రైతులకు నల్ల చట్టాలు వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో చెలిమిల్ల మాజీ సర్పంచ్ భూషణం, మాల మహానాడు నాయకులు శ్రీకాంత్, స్వామి దాసు, శివలింగం, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మాల మహానాడు నాయకులు



## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - చిప్పగిరి**

మండలంలోని దేగులపాడు గ్రామంలో జరిగిన వివాహానికి ఎమ్మెల్యే విరుపాక్షి హాజరయ్యారు. బుధవారం గ్రామానికి చెందిన జూటూరు రంగయ్య కుమారుని వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ ఉనేబాద్ మల్లికార్జున హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. జూటూరు రంగయ్య ఎమ్మెల్యే విరుపాక్షితో పాటు నాయకులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. వైసిపి మాజీ కన్వీనర్ ఓబులేసు, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, జూటూరు లాలూ స్వామి, జూటూరు లింగన్న, మురళీ, బంబం స్వామి పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

స్వాతంత్ర్య సమరయోధుడు అయ్యప్ప రెడ్డి గారి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహకాలు అందజేశారు. పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5,016, రూ.3,016, రూ.2,016 చెక్కులను స్కూల్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్ స్వామి రాజు ఆధ్వర్యంలో అయ్యప్ప రెడ్డి గారి వెంకటరెడ్డి మనవడు వెంకటరెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో విద్యాభివృద్ధిని వెంకటరెడ్డి చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. 1963లో వెంకటరెడ్డి పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ధ్యానం, విద్యా, నైతిక విలువల గురించి వివరించారు.

## సిఐని కలిసిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - కౌతాళం**

కౌతాళం పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన సిఐ అశోక్ కుమార్‌ను టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం టిడిపి మైనార్టీ నాయకులు టిప్పు సుల్తాన్ సిఐ అశోక్ కుమార్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని కోరారు. అలాగే ఉరుకుంద గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కురుగోడు, మహదేవ, కౌతాళం గిరి, మరి కొంతమంది నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రజలకు సేవలందించాలి

**- తహాశీల్దార్‌కు స్వాగతం పలికిన టిడిపి నాయకులు**

**ప్రజాశక్తి - సిబెళగల్**

మండలంలో ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, రెవెన్యూతో ముడిపడిన ప్రజలకు మెరుగైన సేవలందించాలని టిడిపి నాయకులు తహాశీల్దార్‌ను కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహాశీల్దార్ విజయశ్రీకి టిడిపి నాయకులు బుధవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో విఆర్‌ఒలు అవినీతికి పాల్పడకుండా చూడాలని కోరారు. మాజీ కన్వీనర్ చిన్న తిమ్మప్ప, ఎంపిటిసి ఈరన్న గౌడ్, మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్, మోడల్ ఛైర్మన్ తిప్పన్న, హైస్కూల్ ఛైర్మన్ గోవింద్, జనసేన మండల ఇన్‌ఛార్జీ ఫరూక్, కార్యకర్తలు గౌస్, చికెన్ ఈరన్న పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

కోల్‌కత్తాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు నరసింహులు అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోల్‌కత్తాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఈ సంఘటన పట్ల దేశవ్యాప్త నిరసనకు వచ్చిన స్పందన చూసి సుప్రీంకోర్టు సుమోటో కేసుగా నమోదు చేసుకొని తీర్పు ఇచ్చిందని తెలిపారు. అత్యాచారం, హత్య వెనుక రాజకీయ కోణం కూడా ఉందన్నారు. అత్యాచార నిందితులు అధికార పార్టీకి చెందిన వారిగా భావిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా నాయ కులు ఎం.గోపాల్, కె.ప్రభాకర్, నగర నాయ కులు అబ్దుల్ దేశాయ్, సుధాకరప్ప, ఏసు, ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఉమా, జిల్లా నాయకులు జ్యోతి, చిన్న వ్యాపారుల సంఘం జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.




ధర్నాలో మాట్లాడుతున్న నిర్మల

# నర్సింగ్ సేవలు ఎనలేనివి

**- ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు**

**ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్**

నర్సింగ్ సేవలు ఎనలేనివని ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగర శివారులోని కళాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్-నర్సింగ్ కళాశాలలో కళాంజలి నర్సింగ్ కళాశాల (కిమ్స్) ల్యాంప్ లైటింగ్ ఉత్సవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, విశిష్ట అతిథిగా టిటిడి మాజీ కో ఆర్డినేటర్ వై.సూర్య చంద్రా రెడ్డి, కళాశాల ఛైర్మన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి హాజరయి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వై.సూర్య చంద్రా రెడ్డి మాట్లాడారు. నర్సింగ్ కోర్సు చాలా పవిత్రమైందని, ఈ కోర్సుకు ప్రపంచమంతా ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి నర్సింగ్ విద్యార్థి ఈ కోర్సును సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌ఎం శ్రీనివాసులు మాట్లాడారు. ఆస్పత్రి బెడ్‌పై కాలిన, కుళ్లిన గాయాలతో, దుర్గంధం వెదజల్లే శరీరభాగాలతో ఉన్న స్థితిలోను చిరునవ్వుతో సకల సేవలూ అందిస్తారని తెలిపారు. కళాశాల ఛైర్మన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... నర్సింగ్ కోర్సుకు క్రమ శిక్షణతో కూడిన శిక్షణ ఉంటుందని తెలి పారు. ప్రతి నర్సింగ్ విద్యార్థి రోగుల పట్ల అనురాగం, అప్యా యతలు చూపించి రోగులను సంతోషంగా ఇళ్లకు పంపాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సి.అర్చన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గీతాంజలి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి విద్యార్థులకు నర్సింగ్ క్లినికల్ ట్రైనింగ్ పీరియడ్‌లో తీసుకోవాల్సిన మెళకువలను తెలిపారు. కళాశాల అధ్యాపకులు చంద్రకళ, శ్రీలక్ష్మి, సంధ్యలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

# నయనానందకరం రాఘవేంద్రుని స్వర్ణ రథోత్సవం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ రథోత్సవం నయనానందకరంగా సాగింది. బుధవారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా మధ్యరాధన సందర్భంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు స్వయంగా మహా పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. నైవేద్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు. మధ్యారాధన సందర్భంగా ఉత్సవ మూర్తి అయిన ప్రహ్లాద రాయులను స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో భక్తజన సందోహం మధ్య స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సిఐ రామాంజులు, ఎస్‌ఐ గోపినాథ్, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు భద్రత కల్పించారు. రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత పండితకేసరి మహా మహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్‌ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్, ఇఇ సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ రావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతులు

# హత్యాచారాలను అరికట్టేందుకు సమగ్ర మహిళా చట్టం చేయాలి

**- సిఐటియు ఆధ్వర్యంలో నిరసన**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మహిళలపై అత్యాచారాలు, హత్యలను అరికట్టేందుకు సమగ్ర మహిళా చట్టం తీసుకురావాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ సిఐటియు, అంగన్వాడీ, ఆశా, ఆటో యూనియన్‌ల కార్యకర్తలు బుధవారం సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, టౌన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి మాట్లాడారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఘటనకు సంబంధించి నిందితులను వెంటనే కఠిన శిక్షించాలని కోరారు. అంగన్వాడీ నాయకులు నీరజ, మహేశ్వరి, వరలక్ష్మి, చిట్టెమ్మ, లక్ష్మీదేవి, శశికళ, లతా రాణి, షమీం, గ్రేషమ్మ, మేరీ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు శారద, విశాలాక్షి, శివలీల, రాధా, హాజీబీ, మహేశ్వరి, ఎఐకెఎస్ నాయకులు అబ్దుల్లా, సిఐటియు నాయకులు రమేష్, అహ్మద్, రాజు పాల్గొన్నారు. **గోనెగండ్ల** ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు పవన్ తేజ, నాయకులు హుస్సేని, అన్నమయ్య స్వామి, తేజ పాల్గొన్నారు.




సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు, ఆశాలు

## అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

**- మార్కెట్ యార్డులో రాష్ట్ర డైరెక్టర్ పర్యటన**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

మార్కెట్ యార్డులో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను టెండర్లు పిలిచి పూర్తి చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించారు. యార్డు మొత్తం పర్యటించి రైతులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యార్డుకు వచ్చే రైతులకు గిట్టుబాటు ధరతో పాటు కోతలు లేని తూకాలు కచ్చితంగా జరిగేలా చూడాలని సూచించారు. ఆహారం, వైద్య సేవలు, విశ్రాంతి భవనం, సౌచాలయాలు, తాగునీటి వంటి మౌలిక వసతులు వందశాతం అమలు చేయాలన్నారు. మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, డిడి శ్రీకాంత్ రెడ్డి, ఎడి సత్యనారాయణ, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డిఇ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. యార్డులో పర్యటించి రైతులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... పచ్చి వేరుశనగ పంటను ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులను టెండర్లు పిలిచి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, డిడి శ్రీకాంత్ రెడ్డి, ఎడి సత్యనారాయణ, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డిఇ సుబ్బారెడ్డి ఉన్నారు.

## ఎస్ఐ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - నందవరం**



నందవరం ఎస్‌ఐగా వి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా బొమ్మనహల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నందవరం మండలానికి దగ్గరలో ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యం రవాణాను అరికట్టడానికి, అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతానని తెలిపారు. మండల ప్రజలు దళారులు లేకుండా సొంతంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి సమస్యలను తనకు తెలియజేయవచ్చని చెప్పారు.

## పింఛను మంజూరు చేసి ఆదుకుంటాం

**- వెలుగు పీడీ సలీం బాష**

**ప్రజాశక్తి - హొలహర్వి**

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు, వికలాంగులకు పింఛను మంజూరు చేసి ఆదుకుంటామని వెలుగు పీడీ సలీం బాష తెలిపారు. మండలంలోని గూళ్యం గ్రామంలో షేకున్‌బీ, ఖాసీంసాబ్ అనారోగ్యంతో కొంతకాలం క్రితం మృతి చెందారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వారి కుటుంబాన్ని సందర్శించి, పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారి పిల్లలు అనాథలుగా ఉన్నారని, మతిస్థిమితం లేని మగ పిల్లవాడికి సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేసి పింఛను ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వీరికి పింఛను మంజూరు చేసి ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలనూ కల్పిస్తామని చెప్పారు. అలాగే మతిస్థిమితం లేని మరో రెండు కుటుంబాల పిల్లలను పరామర్శించారు. వారికి రూ.6 వేల పింఛను వస్తోందని, రూ.15 వేలు మంజూరు చేయాలని వారి తల్లిదండ్రులు కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పొదుపు మహిళలు జీవనోపాధి ఎంబ్రాయిడింగ్, రొట్టెల తయారీ, ఇస్తరాకుల తయారీ సెంటర్లను పరిశీలించారు అనంతరం హొలహర్విలో మండల సమైక్య భవనంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆలూరు ఏరియా కోఆర్డినేటర్ నవీన్, ఎలొసి.వీరేష్, సిసిలు గోవిందప్ప, మౌలా సాబ్, అకౌంటెంట్ నరసింహుడు, విఆర్‌ఎ గోవిందు, గంగప్ప, ముత్తమ్మ పాల్గొన్నారు.



ఖాసీం సాబ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీడీ




# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఐరన్ బండ రైతులను పరామర్శించిన ఎస్పీ**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

గాజులదిన్నె ప్రాజెక్టు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. బుధవారం మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఎంత నీరుంది, వరద ముంపు ఎదురైతే ఎలా వదులుతారన్న విషయాలను ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఐరన్‌బండ గ్రామానికి వెళ్లి నీటిలో మునిగిపోయే మోటార్లను తీసుకోవడానికి ప్రాజెక్టులోకి వెళ్లి వరద నీటిలో చిక్కుకొని సురక్షితంగా పోలీసుల సహాయంతో బయటకు వచ్చిన రైతులతో మాట్లాడారు.

**కానిస్టేబుళ్లకు అభినందన**

వరద నీటిలో చిక్కుకున్న 25 మంది గంజహళ్లి గ్రామస్తులతోపాటు నీట మునిగిపోతున్న వ్యవసాయ మోటార్లను తెచ్చుకోవడానికి వెళ్లి చిక్కుకుపోయిన ఏడుగురు ఐరన్‌బండ గ్రామస్తులను పవర్ బోట్ ద్వారా సురక్షితంగా బయటకు తెచ్చేందుకు కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుల్ బ్రహ్మయ్య, వెంకటేష్‌ను ఎస్పీ అభినందించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్







